క్లుప్తంగా

సంక్షేమ దరఖాస్తులకు పరిష్కారం

బి.కొత్తకోట : గడప గడపకు మన ప్రభుత్వం, స్పందన కార్యక్రమాల్లో సంక్షేమ పథకాల కోసం అందిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీఓ శంకరయ్య కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్, ఎడ్యుకేషన్ క్వాలిపై సర్వేలపై సమీక్షించారు. వీటి పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు.

నేటి నుంచి అన్నమయ్య సహస్ర గళార్చన

మదనపల్లె : స్థానిక వాసవీభవన్‌వీధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం నుంచి అన్నమయ్య కళాపీఠం నిర్వహణలో అన్నమయ్య సహస్ర గళార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంగీత కళారత్న యరగొల్ల శ్రీనివాస్ యాదవ్ సంగీత నిర్వహణలో సాయంత్రం 3 నుంచి 5 వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఈనెల 22 వరకు జరుగుతుందన్నారు. కళాభిమానులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

మార్కెట్ కమిటీకి రూ.64 లక్షలు

బి.కొత్తకోట : బి.కొత్తకోట–అంగళ్లు వ్యవసాయ మార్కెట్ కమిటీకి రూ.64 లక్షల నిధులను చెల్లించినట్లు ములకలచెరువు మార్కెట్ కమిటీ కార్యదర్శి జగదీష్ బుధవారం తెలిపారు. ములకలచెరువు కమిటీ నుంచి కొత్తగా బి.కొత్తకోట–అంగళ్లు కమిటీ ఏర్పాటవడంతో బి.కొత్తకోట, కురబలకోట మండలాలకు చెందిన ఆదాయంలో రూ.64 లక్షలు నూతన చెల్లించాలని మార్కెటింగ్‌శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ చెల్లించామని జగదీష్ తెలిపారు.

టమాట బాక్సు రూ.700

ములకలచెరువు : స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో నాణ్యమైన టమాట బాక్సు రూ.700 పలికాయి. గత నెల రోజులుగా పూర్తి స్థాయిలో పతనమైన టమాటలు బుధవారం 30 కేజీల బాక్సు రూ.600 నుంచి రూ.700 వరకు పలికాయి. మార్కెట్‌కు టమాటల దిగుమతి తక్కువగా ఉండడంతోనే ధరలు పెరిగినట్లు మండీ యజమానులు చెబుతున్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

పెద్దమండ్యం : పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పి. వెంకటేష్ తెలిపారు. మండలంలోని శివపురంకు సమీపంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో ఐదుగురు పట్టుబడగా, వారి నుంచి రూ. 4,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

29న హిందూ సమ్మేళనం

మదనపల్లె సిటీ : మదనపల్లెలో ఈనెల 29న హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు హిందూ చైతన్య వేదిక కమిటీ వారు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే కార్యక్రమానికి పరిపూర్ణానంద సరస్వతి హాజరుకానున్నట్లు తెలిపారు.

వాసవీ వనిత క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



వాసవీ వనిత క్లబ్ నూతన కార్యవర్గం

మదనపల్లె సిటీ : మదనపల్లె వాసవీ వనిత క్లబ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం స్థానిక సాయి గీత ఫంక్షన్‌హాలులో ఎన్నుకున్నారు. వాసవి గోల్డన్ స్టార్ కెసీజీఎఫ్ సుంకు ఝాన్సీరాణి ముఖ్య అతిథిగా హాజరై ఉపయుక్తమైన సందేశాలను వినిపించారు. నూతన అధ్యక్షురాలిగా క్రాంతిరేఖ, కార్యదర్శిగా జ్యోతి, కోశాధికారిగా జయశ్రీలను ఎన్నుకున్నారు.

కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఏపీఓ మాధవి

తంబళ్లపల్లె : మండలంలో అమలవుతున్న ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్య పెంచేందుకు టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు చొరవ చూపాలని ఏపీఓ మాధవి కోరారు. బుధవారం స్త్రీ శక్తి భవన్‌లో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం జరిగింది. ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలను చైతన్యపరిచి పనులకు వచ్చేలా కృషి చేయాలన్నారు. ప్రతి కూలీ ఆధార్ నెంబర్‌ను జాబ్‌కార్డుకు అనుసంధానం చేయాలన్నారు. కూలీలు పనులు ప్రారంభించినప్పుడు ముగింపు సమయంలో ఫోటోలు తీసి ఆన్‌లైన్‌లో సమాచారం అందించాలన్నారు. ప్రతి కూలీ 4గంటల పాటు పనిచేసేలా చూడాలన్నారు. సమావేశంలో ఉపాధి ఇంజినీర్, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక పాలనే ప్రభుత్వ లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : రాజకీయాలకు అతీతంగా పారదర్శక పాలన అందించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. పట్టణంలోని 30వవార్డులో కౌన్సిలర్ సరిత ఆధ్వర్యంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకాచలపతి, కౌన్సిలర్ సరిత, బాలగంగాధరరెడ్డిలతో కలిసి ప్రశాంత్‌నగర్ సచివాలయ పరిధిలో గడప గడపకు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. గతంలో చంద్రబాబు పాలనలో పథకాలు ఇంటికి వచ్చేవి కావని, అన్ని జన్మభూమి కమిటీల సభ్యుల పర్యవేక్షణలో టీడీపీ కార్యకర్తలకు మాత్రమే అందేవన్నారు. ప్రస్తుతం సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో అన్ని పథకాలు నేరుగా ఇంటి ముంగిటకే అందిస్తున్నామన్నారు. ఎన్నికల ముందు రెండుపేజీల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అధికారం చేపట్టిన మూడున్నరేళ్ల కాలంలో సీఎం జగనన్న 98శాతానికి పైగా నెరవేర్చారన్నారు. దేశచరిత్రలోనే మరే రాష్ట్రంలో లేని విధంగా అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, రైతుభరోసా...ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు మంచిచేస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీనే అన్నారు. జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుంటేనే పేదలకు న్యాయం జరుగుతుందనే విషయాన్ని అందరూ గుర్తెరగాలన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రి, 40 ఏళ్లు ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు ఎందుకు ఇలాంటి పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు మంచి చేయలేదో ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంచి చేస్తుంటే ఓర్వలేక అసత్య ఆరోపణలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మేస్త్రీశ్రీనివాసులు, ఆర్.వి.శివారెడ్డి, ఈశ్వర్‌నాయక్, డిష్‌రామకృష్ణారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ దండుకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ నందినితాజ్, సర్పంచ్ శరత్‌రెడ్డి, వెంకటరమణ, ద్రవిడ యూనివర్సిటీ సెనేట్‌మెంబర్ ఎస్. కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్లూరు రఫీ, శీలంరమేష్, నీరుగట్టివెంకటరమణారెడ్డి, డాక్టర్.అనిల్‌రెడ్డి, సదాశివరెడ్డి, గార్లచంద్రమౌళి, జాన్‌బాబు, ఎల్‌ఐసీ.సుధాకర్, రవి, శ్యామ్‌రెడ్డి, గట్టుచంద్రశేఖర్‌నాయుడు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నిమ్మనపల్లె విద్యార్థి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన దిగ్విజయ్

నిమ్మనపల్లె : రాష్ట్రస్థాయి షాట్‌పుట్ క్రీడాపోటీలకు నిమ్మనపల్లె జిల్లాపరిషత్ హైస్కూల్ (తెలుగు) విద్యార్థి ఎంపికైనట్లు హెచ్‌ఎం.శ్రీదేవి, ఫిజికల్ డైరెక్టర్ భద్రయ్య తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ.. జెడ్పీహైస్కూల్‌లో పదోతరగతి చదువుతున్న విద్యార్థి బి.దిగ్విజయ్ జనవరి11న మదనపల్లె జెడ్పీహైస్కూల్ గ్రౌండ్స్‌లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 20 నుంచి 23 వరకు శ్రీకాకుళం జిల్లా పలాసలోని జీఎంసీ.బాలయోగి క్రీడామైదానంలో ఎస్.జి.ఎఫ్.రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. హెచ్‌ఎం, పీడీ, ఉపాధ్యాయ బృందం దిగ్విజయ్‌ను అభినందించారు.

అందరికీ ఆదర్శం నరసింహయ్య



నరసింహయ్య చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

మదనపల్లె సిటీ : సీపీఎం పార్టీ నాయకుడు నరసింహయ్య అందరికీ ఆదర్శమని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నరసింహయ్య నాల్గవ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ ఏడు దశాబ్దాలుగా కమ్యూనిస్టు ఉద్యమంలో పని చేసిన ఆయన నిరాడంబరంగా ఉంటూ ప్రజల కోసం పోరాడారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది ఉద్యమకారులకు మార్గదర్శి అయ్యారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నక్కా చంద్ర, వెంకటేష్, నారాయణస్వామి, నాగరాజు, జయరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలు గడువులోగా పూర్తి చేయండి



ఉపాధి సిబ్బందితో ఏపీడీ, ఎంపీడీఓ సమీక్ష

పెద్దతిప్పసముద్రం : ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని ఉపాధి హామీ క్లస్టర్ ఏపీడీ నందకుమార్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డితో కలసి ఆయన మండలంలోని క్షేత్ర, సాంకేతిక సహాయకులతో సమీక్షించారు. అధికారులు మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరంలో మిగిలి ఉన్న పని దినాలకు సంభందించి కూలీలకు పనులు కల్పించాలన్నారు. జాబ్ కార్డులు, ఎంత మంది కూలీలకు ఎన్ని పనాలు కల్పించారు అనే విషయాలపై పంచాయతీల వారీగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా పక్కా గృహాలు మంజూరై నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారులకు ఉపాధి హామీ ద్వారా చెల్లించాల్సిన రూ. 23,130ల నగదును తక్షణం మంజూరు చేయాలన్నారు. గ్రామసభల ద్వారా కూలీలను చైతన్యపరచి పనులు కల్పించేలా చూడాలన్నారు. సమావేశంలో ఏపీవో మహేష్ ఉన్నారు.

మంచితనానికి మించిన దైవత్వం లేదు

సయ్యద్ మహమ్మద్ తల్‌హా సాహెబ్



సందేశం ఇస్తున్న సయ్యద్ మహమ్మద్ తల్‌హా సాహెబ్

కురబలకోట : సృష్టిలో మానవత్వానికి మంచితనానికి మించిన దైవత్వం లేదని మౌలానా సయ్యద్ మహమ్మద్ తల్‌హా సాహెబ్ ఉద్బోధించారు. బుధవారం కురబలకోట కొత్త మసీదులో ఆయన దైవ సందేశమిచ్చారు. ప్రతి మనిషి దేవుడు ఇచ్చిన ఈ జన్మకు సార్థకతను చేకూర్చుకోవాలన్నారు. అసలు మనిషి అంటేనే మంచిపనులు చేసేవాడని గుర్తుంచుకోవాలన్నారు. మతాలన్నీ కూడా మానవత్వాన్ని కలిగి ఉండాలని బోధిస్తాయన్నారు. మానవత్వం, మంచితనం, సత్యం, ధర్మం పాటించని వారికి స్వర్గం లభించదని ఖురాన్ కూడా తెలియజేస్తుందన్నారు. ఆధునిక కాలంలో మానవత్వం తగ్గుతోందన్నారు. మంచి మాట మంచితనం ఎప్పటికీ మంచి చేస్తుందన్నారు. మంచి పని చేయడానికి వచ్చే చిన్న అవకాశాన్ని కూడా వదులుకోకూడదన్నారు. విశ్వాసంతో దేవునికి దగ్గరవ్వచ్చన్నారు. పేదలకు, నిస్సహాయులకు ధాన ధర్మాలు చేయడం ఎప్పటికీ మరువరాదన్నారు.

భక్తులందరికీ అన్నసంతర్పణ చేస్తాం



ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని సన్మానిస్తున్న అన్నదాన కమిటీ సభ్యులు

తంబళ్లపల్లె : మహాశివరాత్రి పర్వదినాన మల్లయ్య కొండకు వచ్చే భక్తులకు మల్లికార్జునస్వామి సోషియల్ వెల్ఫేర్ అసోసియేషన్ (అన్నదాన కమిటీ) ఆధ్వర్యంలో అన్నసంతర్పణ నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం నూతన కమిటీ అధ్యక్షులు రమణారెడ్డి ఆధ్వర్యంలో సదుంలోని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని శాలువలతో సత్కరించారు. నూతన కమిటీ ఏర్పాటైన విషయాన్ని ఎమ్మెల్యేకి వివరించారు. కమిటీ సభ్యులను పరిచయం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు భాస్కర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, శివారెడ్డి, రామమూర్తి,సహదేవ, రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఫిబ్రవరి 11న మెగా లోక్ అదాలత్



న్యాయవాదులతో సమావేశమైన ఏడీజే మురళీకృష్ణ, న్యాయమూర్తులు సరస్వతి, సంధ్యారాణి

రాజంపేట : మెగా లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని జిల్లా 3వ అదనపు న్యాయమూర్తి మురళీ కృష్ణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 11న జరగనుండటంతో బుధవారం రాజంపేట బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో కక్షిదారులు చేసిన పొరపాట్లను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునన్నారు. గెలుపు ఓటమిలకు తావులేదన్నారు. రాజీ కాదలచిన కేసుల పరిష్కారానికి చక్కటి వేదిక లోక్ అదాలత్ అన్నారు. మెగా లోక్ అదాలత్‌లో పెద్దసంఖ్యలో కేసులు పరిష్కారం కావాలన్నారు. సమావేశంలో సివిల్ జడ్జి సరస్వతి, జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణిలు మాట్లాడుతూ ఎలాంటి కేసుల్లో రాజీపడవచ్చనేది తెలియజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మినారాయణ, సెక్రటరీ ఆనంద్, సీనియర్ న్యాయవాది రఘునాథరెడ్డి, న్యాయవాదులు జాఫర్, కరుణాకర్, వెంకటేశ్వర్లు, రమణ, షాహిద్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

11 మంది జూదరుల అరెస్టు

మదనపల్లె : కోడిపందెం స్థావరాలపై దాడి చేసి 11 మంది జూదరులను అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఎస్.ఐలు చంద్రశేఖర్, సుధాకర్‌లతో కలిసి ముందుగా అందిన సమాచారంతో మండల పరిధిలోని మాలేపాడు సమీపంలో కోడిపందెం స్థావరాలపై దాడులు చేసినట్లు తెలిపారు. జూదరుల నుంచి రూ.3,290 నగదు, నాలుగు పందెం కోళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

షూటింగ్‌బాల్ ఉమ్మడి చిత్తూరుకు తృతీయస్థానం

మదనపల్లె సిటీ : విజయవాడ విజయ ఇంజినీరింగ్ కాలేజీలో ఈనెల 14న జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–18 బాలుర షూటింగ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు తృతీయస్థానం కైవసం చేసుకున్నట్లు చీఫ్ కోచ్ బాలాజీ తెలిపారు. జట్టు క్రీడాకారులను బుధవారం షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నరేష్, జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీ వసంత, రామా అభినందించారు.

నేటి నుంచి గ్రామసభలు

పెద్దమండ్యం : జగనన్న పాలవెల్లువపై ఎంపిక చేసిన గ్రామాల్లో గురువారం నుంచి రైతులతో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్ రావు, వెటర్నరీ డాక్టర్ విక్రమ్‌రెడ్డి తెలిపారు. గ్రామసభల నిర్వహణపై ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో 54 పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ మేరకు వలంటీర్ల ద్వారా పాడి ఆవులు ఉన్న రైతులను గుర్తించి, వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా గ్రామాలలో పాడి రైతులు నమోదు కాకుంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ మురళి, ఏపీఎం మధుబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'భూ ఆక్రమణలు జరగలేదు'

పీలేరు : పీలేరులో భూఆక్రమణలు జరగలేదని తహసీల్దార్ రవి అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని గూడరేవు పంచాయతీలో సర్వేనెంబరు 204లో 13.40 ఎకరాలు ప్రభుత్వభూమి కాదని సదరు భూములు ప్రైవేట్ వ్యక్తులకు చెందినవన్నారు. రాజీవ్‌నగర్ కాలనీలోని సర్వేనెంబరు 123లో 2.25ఎకరాలు ప్రభుత్వ భూమి అని సదరు భూమి 2011లో ఉర్దూ హైస్కూల్ నిర్మాణం కొసం కేటాయించడం జరిగిందన్నారు. స్థానిక కడప రోడ్డు మార్గంలో పింఛానది పరివాహక ప్రాంతంలోని సర్వేనెంబర్లు 364,367 లలో భూ ఆక్రమణలు జరగలేదన్నారు. ఇదే ప్రాంతంలోని సర్వేనెంబరు 366లో ఉన్న 5సెంట్ల స్థలం ఎలాంటి ఆక్రమణలకు గురికాలేదన్నారు.

వర్గీకరణపై బీజేపీ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

మదనపల్లె : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే విషయంలో నిర్లక్ష్యాన్ని వీడి, తక్షణమే వర్గీకరణపై బీజేపీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) ఉమ్మడి చిత్తూరు జిల్లా కోఆర్డినేటర్ నరేంద్రబాబు డిమాండ్ చేశారు. బుధవారం ఎస్సీ వర్గీకరణ విషయమై కేంద్రప్రభుత్వం, బీజేపీ కేంద్ర పెద్దలపై తీవ్ర ఒత్తిడి తేవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షుడు ఏ.వి.సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ...బీజేపీ అధికారంలోకి వస్తే 100రోజుల్లో వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించి న్యాయంచేస్తామని హామీ ఇచ్చి 9 ఏళ్లు గడుస్తున్నా పరిష్కారం చూపకపోవడం అన్యాయమన్నారు. ఎస్సీ వర్గీకరణ తీవ్రతను అర్థం చేసుకుని ఆయా పార్లమెంటరీ నియోజకవర్గాల బీజేపీ అధ్యక్షులు కేంద్ర పెద్దల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ పట్టణ ఇన్‌చార్జ్ రాజా, రవి, రెడ్డిశేఖర్, వేణుగోపాల్, మధు, చెంబకూరులక్ష్మీపతి, సుబ్బు, అంజి, గణేష్, మారప్ప పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్‌కు సన్మానం

రాజంపేట : రాజంపేట సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్‌ను రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ డైరక్టర్ గండికోట గుల్జార్‌బాషా ఆధ్వర్యంలో ముస్లిం నేతలు బుధవారం సన్మానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజంపేటకు ఐఏఎస్ కేడర్ అయిన అహ్మద్‌ఖాన్‌ను సబ్‌కలెక్టర్‌గా నియమించడం ఎంతైన హర్షణీయమన్నారు. నందలూరు తహసీల్దారు కార్యాలయానికి వచ్చిన సబ్‌కలెక్టర్ అహ్మద్‌ఖాన్‌ను జిల్లా వక్ఫ్ బోర్డు జనరల్ సెక్రటరీ సయ్యద్‌అమీర్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో పలువురు చేరిక
- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి.

వాల్మీకిపురం : పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండలంలోని గండబోయనపల్లికి చెందిన టీడీపీ నాయకులు రేవంత్ రెడ్డి, పవన్, ప్రవీన్, లక్ష్మిపతి, అరుణ్, కలకడ మండలం కదిరాయచెరువుకు చెందిన రామిశెట్టి క్రిష్ణ, మంజునాథ తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలో నంబర్ వన్ స్థానంలో రాష్ట్రం ఉందన్నారు.

ఎస్సీ,ఎస్టీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

పీలేరు : ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కడప మార్గంలోని మాంగల్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో దళిత, గిరిజన సంఘాల నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కాలపరిమితి ఈనెల 23తో ముగుసున్నందున మళ్లీ కాలపరిమితి పొడిగించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వారికి అవసరమైన సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం ముందుంటుందన్నారు. ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ కాలపరిమితి పొడిగించేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు. ధరణీకుమార్, నాగేంద్ర, గట్టప్ప పాల్గొన్నారు.

ఫంక్షన్ హాల్ ప్రారంభం

పట్టణంలోని కడప మార్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భూమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డిల చేత నూతనంగా ఏర్పాటు చేసిన మాంగల్య ఫంక్షన్ హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

కుక్కలతో పోల్చినందుకు క్షమాపణ చెప్పాలి

వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

వాల్మీకిపురం : ముస్లింలను కుక్కలతో పోల్చిన టీడీపీ పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పతనం తప్పదని, వెంటనే అతడు క్షమాపణ చెప్పాలని పీలేరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు అబ్దుల్ కలీమ్, హజ్ కమిటీ మాజీ సభ్యులు కువైట్ ఇబ్రహిం, మండల కోఆప్షన్ సభ్యులు మహబూబ్‌బాషా డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ నేత నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ముస్లిం నాయకులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కుక్కలకు బిస్కెట్లు వేసినట్లు కొందరు ముస్లింలకు పదవులు ఇచ్చి వైఎస్సార్‌సీపీ నేతలు వారిచేత మాట్లాడిస్తున్నారనడం గర్హనీయమన్నారు. ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు చేసిన కిషోర్ కుమార్ రెడ్డిని ముస్లిం సమాజం క్షమించదన్నారు. కిషోర్ కుమార్ రెడ్డి నిజస్వరూపాన్ని ప్రతి ముస్లిం గుర్తించి రాబోవు ఎన్నికల్లో అతనికి, టీడీపీ పార్టీకి ఓటు రూపంలో బుద్ధి చెప్పాలన్నారు.కార్యక్రమంలో సదుం మండల కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, వార్డు సభ్యులు ఇర్ఫాన్, అలీ, జవహర్, నాయకులు చికెన్ మస్తాన్, ఖాద్రి, ఖాదర్‌బాషా, అక్బర్ హుస్సేన్, షాహెద్, సాధిక్, గౌస్, అహ్మద్ బేగ్, అషర్, యూసుఫ్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

పదిరోజుల్లో అనుసంధాన ప్రక్రియ పూర్తిచేయాలి

ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : మదనపల్లె డివిజన్‌లో ఓటరుకార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ పదిరోజుల్లోపు పూర్తిచేయాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి బీఎల్వోలను ఆదేశించారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో మదనపల్లె మండల బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ డివిజన్‌లోనే మదనపల్లె మండలం ఆధార్ అనుసంధాన ప్రక్రియలో వెనుకబడి ఉందన్నారు. ప్రతి బీఎల్వో తనకు సంబంధించిన పోలింగ్‌స్టేషన్ పరిధిలోని లొకేషన్ ఏరియాలో ప్యూరిఫికేషన్ ఆఫ్ ఓటర్‌లిస్ట్‌ను సమగ్రంగా తయారు చేయాలన్నారు. చనిపోయిన, పెళ్లి జరిగి వెళ్లిపోయిన, డబుల్‌ఎంట్రీలు తదితర ఓటర్లకు సంబంధించిన అన్ని వివరాలను నమోదు చేసుకుని, వారి నుంచి తగిన పత్రాలు తీసుకోవాలన్నారు. కొత్త ఓటర్లు ఎంతమంది వచ్చినా నమోదుకు అవకాశం కల్పించాలన్నారు. ఆధార్ అనుసంధాన ప్రక్రియను జనవరి 28లోపు పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ రెడ్డెప్ప, బీఎల్వోలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయండి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీపీ మహమూద్

పెద్దతిప్పసముద్రం : పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ మహమూద్ అన్నారు. బుధవారం ఆయనతో పాటు సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ చంద్రశేఖర్, ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు పీటీఎం సమీపంలోని జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. గృహాలు మంజూరైనా ఇంత వరకు నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారులు తక్షణం పనులు చేపట్టాలని సూచించారు. కొత్తగా మంజూరైన 19 మంది లబ్ధిదారులకు పొజిషన్ ధ్రువ పత్రాలు అందజేశారు.

పెద్దమండ్యం: జగనన్న కాలనీలలో పక్కాగృహాల నిర్మాణం వేగవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీధర్ రావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో ఆయన సమీక్షించారు. సచివాలయాల వారీగా గృహ నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. సకాలంలో లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ సందీప్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పీలేరు : జగనన్న కాలనీలో ఇళ్లనిర్మాణాలను వేగవంతం చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ మురళీధర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఒకటవ సచివాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా సచివాలయ రిజిష్టర్లు, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయాల ఉద్యోగులు ప్రజలతో సఖ్యతగా ఉండాలన్నారు. ఉద్యోగులందరు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. హౌసింగ్ డిజిటలైజేషన్‌ను తొందరగా పూర్తి చేయాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో ప్రసాద్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుఖవ్యాధుల నివారణపై అవగాహన



గుడిబండ కొత్తపల్లెలో రక్తపరీక్షలు చేస్తున్న దృశ్యం

కలకడ : సుఖవ్యాధుల నివారణపై ప్రతి ఒక్కరిలో కనీస అవగాహన కలిగి ఉండాలని కృషిసంస్థ మేనేజర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని గుడిబండ పంచాయతీ కొత్తపల్లెలో ప్రమాదకరమైన ఎయిడ్స్, టీబీ జబ్బులకు పరీక్షలు చేసి అవసరమైన సూచనలు, సలహాలు అందజేశారు. ఎయిడ్స్ మహమ్మారిపై ఆందోళన వదలి అవగాహన కలిగి ఉండాలన్నారు. అక్రమం సంబంధాలు కలిగిన వారికి మాత్రమే సుఖవ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. టీబీకి, ఎయిడ్స్ నివారణకు ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తోందన్నారు. టీబీ చికిత్స ద్వారా దూరమవుతుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సభ్యులు శ్రీనివాసులు, రాణి, రహిం, ధనలక్ష్మి, ఏఎస్‌ఎం చంద్రనాగమ్మ తదితరుతలు పాల్గొన్నారు.

వివాదాస్పద దళిత స్మశానవాటిక పరిశీలన

రామసముద్రం : మండలంలోని ఎలకపల్లె పంచాయతీ కేంద్రంలోని దళిత కుటుంబాలకు కేటాయించిన స్మశానవాటిక వివాదంలో చిక్కుకోవడంతో బుధవారం తహసీల్దార్ శాస్త్రీ పరిశీలించారు. స్థానిక చెల్లాయి చెరువులో పొరంబోకుకు సంబంధించిన సర్వేనెంబరు 6లో ఎలకపల్లె దళితులు 1.80 సెంట్లు భూమిని స్మశాన వాటిక కోసమని ఏర్పాటు చేసుకున్నారు. ఈ స్మశానవాటిక పక్కన రైతు సుధాకర్‌రెడ్డి వ్యవసాయ భూమి, పశువుల షెడ్డు ఉన్నాయి. ఇతను తన పంట ఉత్పత్తుల రవాణాకు, పశువుల పోషణకు స్మశానవాటికలో ఒక వైపు దారి ఏర్పరచుకొని రాకపోకలు సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గత కొన్నిరోజులుగా దళితులు తమ స్మశానవాటికలో రాకపోకలు చేయరాదని దారికి అడ్డంగా గోతి తవ్వేశారు. ఈ విషయమై రైతు ఫిర్యాదు చేయడంతో వివాదాస్పద స్థలాన్ని తహసీల్దార్ పరిశీలించారు. వివాదాస్పద స్థలంలోకి ఇరువురిని వెళ్లరాదని, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని వీఆర్‌వోకు ఆదేశించారు.

కానిస్టేబుల్ పరీక్షకు ఏర్పాట్లు

కురబలకోట : ఈ నెల 22న జరగనున్న సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుల్స్ ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణకు పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. బుధవారం మండలంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల, విశ్వం విద్యా సంస్థలను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పరిశీలించారు. పరీక్ష పత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించారు.